క్లుప్తంగా

పీఓకు సన్మానం

ఏటూరునాగారం : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఇతర సభ్యులు మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాను కలిసి సన్మానించారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలు, గూడేలను సందర్శిస్తూ వారికి ప్రభుత్వం నుంచి వస్తున్న ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రత్యేకంగా అందిస్తున్నందుకు చిత్రామిశ్రాను వెంకటయ్య అభినందించారు.

డీఈఓను కలిసిన ఎస్‌టీయూ నాయకులు

ములుగు : నూతన డీఈఓగా బాధ్యతలు చేపట్టిన సిద్ధార్థరెడ్డిని మంగళవారం ఎస్‌టీయూ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతం, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, ఖాళీ ఉపాధ్యాయుల స్థానాలపై డీఈఓతో చర్చించి, ఎస్‌టీయూ డైరీని అందజేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, కార్యదర్శి ఏళ్ల మధుసుదన్ తెలిపారు. ఎస్‌టీయూ నాయకులు పోరిక శంకర్, హమీద్, సతీష్ పాల్గొన్నారు.

ఎదిర పీహెచ్‌సీలో 'ఆశ డే'

వెంకటాపురం(కె) : మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇంటింటి ఫీవర్ సర్వే చేయడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని గర్భిణులకు బర్త్ వెయిటింగ్ రూమ్‌లకు తరలించాలని తెలిపారు. హెచ్‌ఈఓ కోటిరెడ్డి, రామలక్ష్మి, వెంకటేశ్వరావు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మంగపేట : అంబేడ్కర్ యువజన సంఘం నూతన మండల కమిటీని మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య హాజరయ్యారు. అంబేడ్కర్ యువజన సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా ఎంపెల్లి వీరస్వామి, ప్రధాన కార్యదర్శులుగా బోడ రామచంద్రం, రాటింకి సందీప్, ములుగు డివిజన్ కన్వీనర్లుగా బసారికాని హరికృష్ణ, మోదుగు బాబు, జిల్లా కన్వీనర్‌గా ఎడ్ల నరేష్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

పరామర్శ

ములుగు రూరల్ : మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన గుండెబోయిన రవిగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని గౌడ సంఘం జేఏసీ నాయకుడు ముంజాల భిక్షపతిగౌడ్ పరామర్శించారు. మంగళవారం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రవిగౌడ్, ఓడ రాజు, భద్రయ్య, శ్రీహరి తదితరులు ఉన్నారు.

చేయూత



కన్నాయిగూడెం : మండలంలోని గూర్రేవుల గ్రామానికి చెందిన చెన్నూరు స్వరూపకు ముప్పనపల్లి సహాయ నిధి గ్రూప్ సభ్యులు అండగా నిలిచారు. స్వరూప అనారోగ్య సమస్యలతో హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పేదకుటుంబం కావడంతో వారి బాధను మండలంలోని ముప్పనపల్లి సహాయ నిధి గ్రూప్ సభ్యులకు తెలియజేయగా గ్రూప్ అడ్మిన్ అబ్బు సతీష్ దాతలు సహాయం చేయాలని మెసేజ్ పోస్ట్ చేశారు. దాతల ద్వారా సేకరించిన రూ.10వేలను మంగళవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి దాతలు అండగా నిలవాలన్నారు.

డుమ్మాలకు చెక్..



పస్రా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు



చల్వాయి మోడల్ స్కూల్‌లో..

- ఎఫ్ఆర్ఎస్‌తో ఉదయమే బడికి చేరుకుంటున్న టీచర్లు
- ఉదయం, సాయంత్రం హాజరుతో సాకులకు నో ఛాన్స్
- శుభపరిణామమంటున్న విద్యావేత్తలు

గోవిందరావుపేట : ఉదయం బడిగంట మోగక ముందే ఉపాధ్యాయులు పాఠశాలకు పరుగులు పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 1వ తేదీనుంచి ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్) యాప్ ద్వారా టీచర్ల హాజరును నమోదు చేస్తోంది. ఉదయం 9గంటలకు, సాయంత్రం 4:15 నిమిషాల తర్వాత రెండు సార్లు ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సిందే. దీంతో మొన్నటి వరకు ఇష్టారాజ్యంగా పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు.. ఇప్పుడు ఉదయం 9 గంటల్లోపే స్కూల్‌కు వెళ్తున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో మొత్తం 30 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో నెట్‌వర్క్ సరిగా పని చేయని గ్రామాలు కూడా ఉన్నాయి. అలాంటి పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ వల్ల టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఎఫ్ఆర్ఎస్ నిర్ణయంతో విద్యార్థులకు మేలు జరుగుతుందని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

ఏజెన్సీ పాఠశాలల్లో సిగ్నల్స్, బస్సుల కొరతతో అంతరాయం

ఏజెన్సీ ప్రాంతంలో ఎఫ్ఆర్ఎస్ హాజరు ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. అడవి ప్రాంతాలు ఎక్కువగా ఉండడం వల్ల నెట్ వర్క్ సమస్యలు వేధిస్తున్నాయి. కొందరు ఉపాధ్యాయులు హాజరు నమోదు చేసుకోవడానికి స్కూల్ వెలుపల సిగ్నల్ వచ్చే ప్రదేశాలకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. ఏజెన్సీ గ్రామాల్లో బస్సులు, ప్రైవేట్ వాహనాలు రాలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సాకులు లేవు..

మొన్నటి వరకు కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు ఆలస్యంగా వెళ్లేవారు. ఒక వేళ హెచ్‌ఎం అడిగితే ఎదురు తిరిగేవారు. మరికొందరు రాజకీయ అండతో ఇష్ట మొచ్చినట్లు వ్యవహరించే వారు. కొందరు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. ఒక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే ఒకరు ఒక రోజు.. మరొకరు ఇంకో రోజు పాఠశాలకు వెళ్లేవారు. సాయంత్రం 4 గంటలు కాక ముందే ఇంటిబాట పట్టేవారు. బస్సులు దొరకడం లేదనే సాకుతో ముందే తోటి ఉపాధ్యాయులకు చెప్పి కొందరు బయటపడే వారు. వీటన్నింటిని ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ యాప్ చెక్ పెట్టింది.

సమస్యలు ఉన్నాయి..

గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగ్గా లేకపోవడం వల్ల హాజరు నమోదు సమస్యగా మారుతోంది. యాప్ పని చేయకపోతే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. రోజు రెండు సార్లు హాజరు తప్పనిసరిగా చేయడం వల్ల పరీక్షల డ్యూటీలు, సర్వేలు, ట్రెయినింగ్‌ల వంటి పనుల అంతరాయం కలిగిస్తున్నాయని కొందరు ఉపాధ్యాయులు అంటున్నారు. తమపై ప్రభుత్వానికి నమ్మకం లేదనే అభిప్రాయం కొందరిలో కలుగుతుంది. ఫేస్ డేటా సెక్యూరిటీపై కూడా అనుమానాలు ఉన్నాయి. ముఖ్యంగా మహిళ ఉపాధ్యాయులు దూరప్రాంతాల్లో సమయానికి చేరుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు.

నిర్ణీత సమయంలోనే..

ఉదయం 9గంటల్లోపు ఉపాధ్యాయులు వారు పని చేస్తున్న పాఠశాలకు వెళ్లి ఎఫ్ఆర్ఎస్‌లో అటెండెన్స్ వేసుకోవాలి. అదే పాఠశాల ఆవరణలో నిల్చొని అటెండెన్స్ వేస్తేనే ఫొటో క్యాప్చర్ అవుతుంది. 9 గంటల ఒక్క నిమిషం దాటినా యాప్‌లో హాజరు ప్రజెంట్ అని చూపినా పక్కన రెడ్ మార్క్ కనబడుతుంది. అలాగే సాయంత్రం 4:15 గంటల లోపు వెళ్లినా హాజరు తీసుకోదు. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలకు పూర్తి సమయం కేటాయిస్తున్నారు.

మంచి నిర్ణయం



రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా మంచి నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలలు మెరుగు పడతాయి. ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు హాజరు అవుతారు. విద్యార్థులు కూడా సమయానికి వస్తారు. తర్వాత పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగే అవకాశం ఉంది.

– వన్నాల శ్రీనివాస్, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం, పస్రా

విద్యార్థులు అలవాటు పడతారు



ఫేస్ రికగ్నేజేషన్ సిస్టం మంచి పద్ధతి. ఉపాధ్యాయుల హాజరు సరిగ్గా రికార్డు అవుతుంది. ఎవరూ మాన్యువల్‌గా తప్పుడు హాజరు నమోదు చేయలేరు. మేము కూడా సమయానికి పాఠశాలకు రావడానికి దోహదపడుతుంది. గురువులు సమయపాలనలో ఉంటే విద్యార్థులు కూడా అలవాటు పడతారు.

– గండు కుమార్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్/కాలేజీ, చల్వాయి

యూరియా సరఫరాపై తప్పుడు ప్రచారం

- జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు రాజేందర్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్ గౌడ్

ములుగు : యూరియా సరఫరాపై బీఆర్ఎస్, బీజేపీ నేతలకు అవగాహన లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తూ మతి భ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. యూరియా సరఫరా చేయాల్సింది కేంద్రమేనని, రాష్ట్రంలో కావాలనే యూరియా సరఫరాపై రైతులకు తప్పుడు సమాచారం ఇస్తూ రైతులను బీఆర్ఎస్, బీజేపీ నేతలు అయోమయానికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాకు 11 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, మంత్రి సీతక్క కృషితో జిల్లాకు అదనంగా యూరియా వచ్చిందన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ప్రతిరైతుకు యూరియా తప్పకుండా అందుతుందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, నాయకులు భిక్షపతి, కూనూరి అశోక్, ముసినపల్లి కుమార్, పల్లె జయపాల్‌రెడ్డి, బాదం ప్రవీణ్, పావని తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ ఎదుట రైతులు

మంగపేట: మండల కేంద్రం, రాజుపేటలోని ఎఫ్ఎస్‌సీఎస్ కార్యాలయాల వద్ద యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులుదీరారు. రెండు సెంటర్లలో 440 బస్తాల స్టాకు మాత్రమే ఉండటంతో రైతులు వందల సంఖ్యలో క్యూలో ఉన్నారు. దీంతో పోలీసుల పర్యవేక్షణలో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున విక్రయించారు. మంగపేటలో స్టాకు అయిపోయిందని ఒకటి రెండు రోజుల్లో స్టాకు వచ్చిన వెంటనే ఇస్తామని చెప్పి క్యూలో ఉన్న రైతులకు స్లిప్పులు ఇచ్చినట్లు ఎఫ్ఎస్‌సీఎస్ సీఈఓ జగన్నాథరావు తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కలెక్టరేట్ ముట్టడిలో ఎస్ఎఫ్ఐ నాయకులు

ములుగు రూరల్ : ప్రభుత్వం వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు సాదు రాకేష్, బాలు, లక్ష్మణస్వామి, ధనుష్, సాయి చరణ్, తదితరులు ఉన్నారు.

లారీలు, పొక్లెయినర్లు స్వాధీనం

ఎస్ఎస్‌తాడ్వాయి : జంపన్నవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మేడారంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెడ్డిగూడెం, కొత్తూరు కాజ్‌వే, చిలకలగుట్ట, ఊరట్టం కాజ్‌వే సమీపంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం జంపన్నవాగు నుంచి డంపు చేసిన ఇసుకను లారీల్లో లోడింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడికి వెళ్లి చూడగా లారీ, పొక్లెయినర్ డ్రైవర్లు తప్పించుకునేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకుని విచారించామని అన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను లారీలో లోడింగ్ చేస్తున్నట్లు వారు ఒప్పుకున్నట్లు తెలిపారు. మూడు లారీలు, పొక్లెయినర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థులకు అవగాహన

వెంకటాపురం(ఎం) : మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై ఆ శాఖ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సంభవించే ప్రమాదాలు, నివారణ చర్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ సాంబరాజు వివరించారు. ట్రాన్స్‌కో ఏఈ రమేష్, అసిస్టెంట్ లైన్‌మెన్ కృష్ణాకర్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



ములుగు : జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ములుగు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి ప్రశంసపత్రాలతో పాటు మెమొంటోలు ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చుంచు రమేష్, బలరాం రెడ్డి, సానికొమ్ము రవీందర్‌రెడ్డి, కొండి సాంబశివ, సోమ నర్సయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

అన్నదానం

ములుగు రూరల్/వాజేడు: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని మున్సిపల్ కమిషనర్ సంపత్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని వీవర్స్ కాలనీ వినాయక మండపం వద్ద సైకం స్వరూప–నర్సింహరెడ్డి దంపతులు అన్నదానం ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు .అలాగే వాజేడు మండలంలోని గుమ్మడి దొడ్డి గ్రామంలో భక్తులు గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

రైతులకు ఉపయోగపడని 'భూ భారతి'



సమావేశంలో మాట్లాడుతున్న నాగరమేశ్

మంగపేట : బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌ను కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి రైతులకు ఏ మాత్రం ఉపయోగపడడం లేదని బీఆర్ఎస్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిష నాగరమేశ్ ఆరోపించారు. మండలంలోని రాజుపేటలో ఆపార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎడ్లపల్లి నర్సింహారావు అధ్యక్షతన మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరమేశ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ద్వారా భూ యజమానులకు ఎంతో లబ్ధి చేకూరిందని తెలిపారు. భూ భారతి పోర్టల్‌తో భూసమస్యలు పరిష్కారం కాకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నం కావడంతో రైతులు ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, మండల నాయకుడు రాజుయాదవ్, శంకర్, హుస్సేన్, శ్యాంబాబు, సాంబశివరావు, రాయసాహెబ్, విశ్వేశ్వర్‌రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్కిల్‌వాల్ నిర్మించాలి



మల్లికుంట వద్ద కోతకు గురవుతున్న పొలాలు

ములుగు రూరల్ : అన్నంపల్లి శివారులోని మల్లికుంట వద్ద వరద ఉధృతిని తట్టుకునేందుకు రోడ్డుకు ఇరువైపులా స్కిల్ వాల్ నిర్మించాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి బానోత్ నారాయణ సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మల్లికుంట వద్ద కోతకు గురైన పొలాలను రైతు సంఘం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లికుంట మత్తడి వరద ఉధృతి వల్ల అన్నంపల్లి గ్రామ శివారుల్లోని 50 ఎకరాల పంట పొలాలు దెబ్బతింటున్నాయన్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపులా స్కిల్ వాల్ డ్రెయినేజీలు నిర్మించాలని అన్నారు. నాయకులు ప్రభాకర్, ఐలయ్య, బాలాజీదాస్, స్వామి, పూర్ణచందర్ ఉన్నారు.

గ్రామాల్లో పాలన అస్తవ్యస్తం



బురద రోడ్డును చూపిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

గోవిందరావుపేట : గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని పస్రా గ్రామంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యల పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో నిధులు లేక గ్రామాలు అభివృద్ధి కుంటుపడిందన్నారు. పస్రాలోని ఆరోవార్డులో, డబుల్ బెడ్రూం కాలనీలో కనీస వసతులు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి పిట్టల అరుణ్, గొంది రాజేష్, జక్కు వేణు, మాదాసు శ్రవణ్, పల్లపు రాజు, చిరంజీవి, దామోదర్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

తూము షెట్టర్‌కు మరమ్మతు చేయాలి




తోపుకుంట తూము వద్ద ఆయకట్టు రైతులు

ములుగు రూరల్ : ములుగులోని తోపుకుంట తూము షెట్టర్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు కోరారు. మంగళవారం షెట్టర్ తీసి నీటిని కిందకు వదిలే ప్రయత్నం చేయగా రాకపోవడంతో వెనుతిరిగారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా తోపుకుంటలో నీరు చేరి సుమారు 30 ఎకరాల మేరకు నాటు నీట మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తూము షెట్టర్‌ను తొలగించి నీటిని దిగువకు విడుదల చేయాలన్నారు. వేసవిలో నీటి పారుదల శాఖ అధికారులు షెటర్ మరమ్మతులు చేపట్టాలని ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని అన్నారు. రైతులు గొర్రె అంకుష్, ఒజ్జల లింగయ్య, పోరిక సారయ్య, సన్నెబోయిన లింగన్న, దూడబోయిన రామస్వామి, బొంతల రాజు, మధు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ..

కన్నాయిగూడెం : మండలంలో గోదావరి ప్రవాహం తగ్గుతూ..పెరుగుతోంది. వారం రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి వరద నీరు చేరుతోంది. దీంతో తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద నిన్నటి వరకు తగ్గినా గోదావరి మంగళవారం ఉదయం వరకు 6,20,290 క్యూసెక్కులకు చేరింది. సాయంత్రం మళ్లీ తగ్గుతు 5,67,900 క్యూసెక్కులకు చేరింది. బ్యారేజీ వద్ద నీటిమట్టం 80.80 మీటర్లు కొనసాగుతోంది.



సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం

సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమించాలి

గోవిందరావుపేట : సీతారాం ఏచూరి మృతి దేశప్రజలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి తెలిపారు. సీతారాం ఏచూరి వర్ధంతి సభను పార్టీ పస్రా గ్రామ కమిటీ కార్యదర్శి కడారి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, కార్యదర్శివర్గ సభ్యుడు వెంకట్ రెడ్డి, చిట్టిబాబు, గొంది రాజేష్, ఆగిరెడ్డి, సోమా మల్లారెడ్డి, మురళి, పురుషోత్తం రెడ్డి, రాజు, శ్రీను, అశోక్, నర్సయ్య, ఐలయ్య, బ్రహ్మాచారి, రమేష్, కవిత, సువర్ణ, రాజేశ్వరీ, సమ్మక్క, సరళ, రమాదేవి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దిక్సూచి వైఎస్సార్




వెంకటాపురం(కె) : వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు




మంగపేటలో..

వెంకటాపురం(కె)/మంగపేట : దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా మండలకేంద్రాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అభివృద్ధికి దిక్సూచి వైఎస్ రాజశేఖరరెడ్డి అని పలువురు నాయకులు వైఎస్సార్ సేవలను కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపైనే ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసి రైతు బాంధవుడని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ కుట్ర



వెంకటాపురం(కె): రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎస్ఎస్‌తాడ్వాయి: జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం మానుకోవాలని, కేసీఆర్‌పై సీబీఐ విచారణను ఆపివేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంప రాంబాబు మాట్లాడుతూ..కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని సీబీఐకి అప్పగించడం కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలో భాగమేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండ బెట్టి ఆంధ్ర రాష్ట్రానికి నీళ్లు తరలించడానికే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో కేసీఆర్, హరీష్ రావును ముట్టుకుంటే తెలంగాణ ప్రజలు సహించబోరని, అందుకు కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హితవు పలికారు. నాయకులు డర్రా దామోదర్, గద్దం వివేక్, చిడెం రవి కుమార్, పూనెం శ్రీదేవి, కొండపర్తి శివకృష్ణ, తుమ్మ రామకృష్ణ, పూజారి ఆదిలక్ష్మి, కొప్పుల వినోద్, వేల్పూరి లక్ష్మినారాయణ, జెజ్జరి నారాయణమ్మ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నిర్ణయం సరికాదు

ఎస్ఎస్‌తాడ్వాయి : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరికాదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, ప్రాజెక్ట్‌పై ఘోష్ కమిటీని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నగేష్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, ఎండీ రఫీక్, మోహన్‌రావు, కొండూరి నరేష్, రమేష్, గొంది శ్రీధర్, మహిళ అధ్యక్షురాలు నాగమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపుతప్పి గుంతలో పడిన ఆటో



మంగపేట : మండలంలోని మొట్లగూడెం(మల్లూరు)–నర్సింహసాగర్ ప్రధాన రోడ్డుపై మంగళవారం ఆటో అదుపుతప్పి గుంతలో బోల్తా పడింది. మల్లూరు బీసీ కాలనీకి చెందిన వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు ఊరుగొండ మురళి తన ట్రాలీ ఆటోలో వాటర్‌ను విక్రయించేందుకు ట్యాంక్‌తో నర్సింహసాగర్‌కు వెళ్తున్నాడు. మల్లూరు వాగు బ్రిడ్జి సమీపంలోని ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాంక్ పొలంలో పడిపోగా, మురళికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రధాన రోడ్డుపై పలుచోట్ల ప్రమాదకరంగా భారీ గుంతలు ఏర్పడగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.